# తప్పీ-నన్ను క్షమించు

కొండముది శ్రీరామచంద్రమూర్తి



"టికెట్.... టికెట్.... టికెట్.... టికెట్."

టికెట్ కలెక్టరు ఆ కంపార్ట్‌మెంట్‌లో వున్న ప్యాసెంజర్ల టికెట్లు చెక్ చేస్తున్నాడు. తెల్లని యూనిఫాంలో అతను తళతళా మెరిసిపోతున్నాడు. గుండ్రని మొహం. లావుపాటి పెదిమలమీద బారుగా పెరిగి కిందకు దిగిన మీసాలు. కోటేరేసిన ముక్కు. తీక్షణంగా మెరుస్తున్న నల్లని కళ్ళు. కళ్ళకు అందంగా అమరి ముక్కుమీద నిలబడ్డ ఫారిన్ కూలింగ్ స్పెక్ట్స్. మనిషి చకచకా మాట్లాడేస్తున్నాడు. గబగబా టికెట్లు తీసుకుని, పరిశీలించనట్టే పరిశీలిస్తూ, సంతకాలు పెట్టేస్తూ వాటిని మళ్ళీ తీసుకున్నవారికి తిరిగిచ్చేస్తున్నాడు.

ప్యాసింజరు రైలు పడుతూ లేస్తూ నడుస్తోంది. ఉస్సు రస్సురంటూ యింతింత నల్లని పొగను కరుళ్ళు కరుళ్ళుగా ఆకాశంలోకి విరజిమ్ముతోంది. పట్టాల పక్కనే వున్న పొలాల్లో పనిచేసుకుంటున్న వాళ్ళు కళ్ళింతచేసుకుని రైలువేపు చూస్తున్నారు. ఉత్సాహం వసితసంగా వున్న వాళ్ళు. రైల్లో ప్రయాణం చేస్తున్న అపరిచితులకు "టాటా" చెబుతున్నారు.

టికెట్ కలెకరును చూసి ప్యాసింజర్లు అటెన్షన్‌లోకి వస్తున్నారు. పర్సుల్లోంచి చొక్కా జేబుల్లోంచి, బొడ్డు దగ్గరి మడతల్లోంచి, కొంగు ముడుతల్లోంచి. జాకెట్ల లోతుల్లోనుంచి టికెట్లుతీసి చూపించి, సంతకం చేయించుకుని మళ్ళీ అక్కడ జాగర్త చేసుకుంటున్నారు. కంపార్ట్‌మెంటంతా తొక్కిడిగా వుంది. రణగోలగా వుంది. ఒక మూల పసిబిడ్డ ఏడుపు. మరోసీటు దగ్గర రేడియో పాట. ఒకరి నోట్లో రాజకీయాలు, మరొకరి నాలిక మీద వేదాంత బోధ. ఆ ప్రక్కగా ఆమె కూచుని వుంది. పిటపిటలాడుతున్న యౌవనం రెవిక లేదు. వక్షస్థలం మీద ఆచ్ఛాదన పైను గాలికి ఎగిరెగిరి పడుతోంది. తలుపు దగ్గరగా ఆమె కాళ్ళు బార జాపుకుని కూచున్నది. ఒంటిపొర చీరలోపల నాజూకు లంగాలేదు. ముక్కుకు పత్తు. కళ్ళకు కాటుక!

"ఏందే అప్పా- టేసనొత్తుందేటి?" యాసగా అడిగింది. వేళ్ళతో నొసలుమీద పడుతున్న ముంగురులను సరిచేసుకుంది. చుటను నిప్పు కొనవేపు నోట్లో పెట్టుకుని, అరమూతలుగా కళ్ళు మూసుకుని కాసేపు ఆ సౌఖ్యం అనుభవించి, ఆ తర్వాత చుట్ట ముక్కను బయటకు తీసి, రెండు వేళ్ళ సందునుండీ బయటకు తుపుక్కున వుమ్మేసింది. ఆమె పక్కనేవున్న బుట్టలో రెండు కోళ్ళు కురుకురుమంటున్నాయ్ "ఊరుకోండెహె! మీ జిమ్మడ" అంటూ ముతక తిట్టొకటి తిట్టింది.

టికెట్టు కలెక్టరు ఆమె దగ్గరకు వచ్చాడు. పమిట తొలిగీ తొలగని ఆమె ఎత్తైన వక్షస్థలం వేపు చూస్తూ, "టికెట్టేది?" అన్నాడు గంభీరంగా. బొడ్డు మడతలకు దిగువగా చీరమడతలో దాచుకున్న టికెట్టును ఆమె అతి జాగ్రత్తగా బయటపెట్టింది.

"ఆ కోళ్ళకు?"

"కోళ్ళకు తిక్కెట్టేటి బాబూ!" ఆమె అమాయకంగా అడిగింది.

"అక్కర్నేదేటి? ఇది నీ సొంత బండను కున్నావేటి? నీ తాతలు కటించినారేటి? తీవే టికెట్టు!! గుడిసేటి నంజకానా!" అతని గొంతులో వ్యంగ్యం, అవమానం, అసహ్యం, చిన్నతనం అన్నీ అన్నీ కలిసి ఆమె పెదిమలను వణికించినయ్. ఆమె కళ్ళలో నీళ్ళు చిలికించినయ్

"నా దెగ్గర తిక్కెట్టు నేను బాబూ!" ఆ గొంతులో గాద్గద్యం, నిస్సహాయత.

"అయితే ఫైను కట్టు...!"

"డబ్బుల్లేవు బాబూ!" ఆమె ఏడుస్తోంది

అతను ఆమె కోళ్ళబుట్టను ఒక్క తన్ను తన్నాడు. కుయ్యోమన్నాయ్ కోళ్లు అతనామెను చెయ్యి పట్టుకుని బలంగా గుంజి లేచి నుంచోపెట్టాడు. అట్లా లేవడంలో ఆమె పమిట చెంగు కింద పడిపోయింది ఆమె స్తనాలు ఒక్కసారిగా చూపరుల కళ్ళల్లోకి తన్నుకొచ్చాయి. ఆమె వంగి కిందపడ్డ పమిటచెంగును చేతుల్లోకి తీసుకుంది. ప్యాసింజర్లెవరూ మాట్లాడడం లేదు. ఆమె వక్షస్థలపు లోతుల్లోకి చూస్తున్నారు

టికెట్టు కండక్టరు ఆ ద్రౌపదిని లెట్రిన్‌ల దగ్గరగావున్న ఖాళీస్థలం వక్కకు లాక్కుని వెళ్ళి నిలబెట్టాడు. "ఫైను కట్టలేకపోతే, ఆ పిట్టల్నీ, నిన్నూ మా వాళ్ళ కప్పగిస్తా!" అన్నాడు కన్ను గీటుతూ.

స్టేషను దగ్గరపడుతోంది. పట్టాల ప్రక్కన కలకలం ఎక్కువౌతోంది. టికెట్టు కలెక్టరు మరీ మరీ దగ్గరకొస్తున్నాడు, అతని బెదిరింపు ఎక్కువౌతోంది. ఆమె అతనివేపు అసహ్యంగా చూసింది. ఏదో వూపు వచ్చిందానిలాగా అతని చేతుల్లోంచి తన చేతిని లాక్కుని, ఆ కోళ్ళబుటను రెండు చేతుల్లోకి తీసుకుని తలుపులోనుంచి బయటకు గిరవాటు వేసింది. "అన్నా! పట్టుకో, పట్టుకో!" అంది పెద్దగా బయటనుండి ఆశ్చర్యంగా యెగిరిపడే కోళ్ళను విచిత్రంగా చూస్తున్న ఓ వయసుమీరిన మనిషితో. "అట్ని తీసుకొని టేసను బయటికి రా!" అన్నది మళ్ళీ. పట్టూరు స్టేషనులో రైలు ఆగీ ఆగకుండానే ఆమె క్రిందకు దూకింది. ఒక్కసారి ఝాడించి జడ ముడి వేసుకుంది. కొంగు బుజాల మీదకు లాక్కుంది. ఆ టికెట్టు కలెకరును క్రిందకు పడేట్టుగా లాగి అతని రెండు చేతులూ పటుకుని "అయ్యలారా! అమ్మలారా! సూడండి బాబులూ ఇది సూడండి! వొంటరిదాన్ని చేసి నానుండి అన్నేయంగా డబ్బులు గుంజేబోనాడి తెల్లబట్టల పెద్దమడిసి! నా మానం తీసేసుండు, నా కొంగు తప్పించుండు" అంటూ పెద్దగా అరవడం మొదలెట్టింది.

ఆమె అట్లా అరుస్తూ వుండగానే నలుగురూ నాలుగు వేపులనుండీ వచ్చారు. ఒకరతని కోటు పట్టుకున్నారు. మరొకరాయన అఫీషియల్ సైను లాగేసుకున్నారు. వేరొకరు అతని చేతిలో రశీదు పుస్తకాన్ని చింపేశారు.

రైలు కూత కూస్తున్నది బయలేరడానికి. భంగపడ్డ టికెట్టు కలెకరు సర్దుకుని తలెత్తేలోపునే మళ్ళీ ఎవరిదారిన వాళ్లు వెళ్ళిపోయారు. ద్రౌపది దూరంగా నిలబడి "సాలా ఫైను!" అన్నది నిర్లక్ష్యంగా నవ్వుతూ. టికెటు కలెకరు ఆమె వేపు చూడక తలొంచుకున్నాడు. కంపార్ట్‌మెంటులోంచి ఈ భాగోతం చూస్తున్న ప్యాసింజర్లు నవ్వుతున్నారు. దూరంగా కోళ్ళను తీసుకువస్తూ కనిపించిన పెద్దమనిషి. "ఇదిగో సెల్లాయ్ నీ కోళ్ళు!" అంటున్నాడు స్టేషను బయటనుండి. ద్రౌపది నవ్వుతోంది. "నిన్ను క్షమించాను- పోరా!" అన్నట్టుగా బయటకు నడిచింది. ★